దిక్కులేని కుక్కపిల్ల

శ్రీ కె. ఆర్. రెడ్డి

పుడమి తల్లికి పురిటి నొప్పులు వచ్చి మూగగా మూలిగింది. నింగినిండా నీహారం కురిసింది. ప్రకృతి మాత పమిట విసిరింది. మలయానిలం మంత్రసాని తనంలో 'అమ్మా!' అన్న ఆ వేదనలోంచి 'కేవు, కేవు' మని కేకలు ప్రాదుర్భవించి ప్రపంచాన్ని పారవశ్య పరిచాయి

కర్ణుడిలాగా కవచకుండలాలు లేవు—

రాకుమారుడిలా రాజసము పుట్టి పడలేదు—

పుడమి గర్భంలో పూడిపోయిన నల్లబొగ్గులా నిగనిగలాడే కళ్ళు తెరవని కసుగందు 'కేవు' మంది.

అమరలోకం విరిజల్లులు విసరలేదు. గంధర్వులు గానం చేయలేదు. సముద్రాలు పొంగడము, వృక్షతతి విరియబూయడము, కోయిల కూనలు కుహూరుతాలు పాడడము, ఈ విశేషాలు ఏవీ జరుగలేదు.

పక్షులు నిదురోతున్నయి. కొమ్మలు మోడుబారాయి. సముద్రం చల్లగా కునుకు తీస్తూంది. అర్ధరాత్రి వేళ కమ్మగా కన్ను మూయకుండా ఇంత అల్లరీ ఎందుకు చేయాలి అని?

పుడమి తల్లి మాత్రం పురుటి నొప్పులతో బాధగా వొళ్ళు విరిచింది.

ఒకటి రెండు సృగాలాలు సృష్టిని చూస్తూ 'ఓ' మని ఓంకారం తీస్తున్నాయి.

ఎక్కడో ఊరి మూలనుంచీ ఆకలితో అరవలేని—కూటి బాధతో కునుకురాని—కుమిలిపోతూన్న కుంటి కుక్క మూగగా మూలిగింది.

ఎటుకోసం వెదికి వేసారిన దివాంధము దిక్కులు చూస్తూ రెక్కలు తాడించింది.

'అం...మ్మాం!' కొడికట్టిన గుడ్డిదీపం కొంటె గాలికి గుప్పున ఆరిపోయింది.

మొరడు బారిన మోటుకొమ్మ మొగ్గ తొడిగి ఎండిపోయింది. కళ్ళు తెరవని కసుగందు మాత్రము 'కేవు' మన్నాడు ప్రకృతి మాత పమిటలోనుంచి.

నింగినిండా నీహారం. భూమినిండా వెచ్చదనం. కుంటి కుక్కని మాత్రం కూనిరాగాలు.

* * *

'ఛీ దెయ్యముండా! వెళ్ళవే యిక్కణ్ణుంచీ. ఇక మీదట గుమ్మము తొక్కావా బుర్ర పగులగొడుతా.' అంటుంది సరోజమ్మ.

'దీని జన్మ తగలెట్ట ఎంతపని చేసుకుంది పాపిముండ!' అని మొహంమీద ఎత్తి పొడిచి వెళ్ళగొడుతుంది సుబ్బాయమ్మ.

'ఏ నూతిలోనో—గోతిలోనో పడి విరగడై పోయివుంటే బావుండేది. నా కడుపున పుట్టెడు అగ్గిపోయటానికి పుట్టింది. తూ! పోవే గుమ్మం వదిలి. మొహం చూస్తే ముప్పై యేళ్ల శని ఆవాహనవుతుంది' అని చీదరిస్తుంది కన్న కడుపు

దారిన పోయే దాసయ్య కూడా 'ఛీ' అని ఛీకొడతాడు.

ఎదురుపడ్డ వెంగళప్ప కూడా 'థూ' అని వుమ్మి వేస్తాడు.

ఎందుకు? ఎందుకిలా చేస్తున్నారు వీళ్ళు? అర్థం కాలేదు సీతికి.

బుర్ర గిర్రని తిరిగిపోతూంది. కడుపు నకనకలాడుతుంది' ఆకలితో. కడుపులోని కదలికలు 'అమ్మా' అని అంగలారుస్తాయి. కానీ, వీళ్ళందరికీ ఏమయింది? ఎందుకిలా దెప్పిపొడుస్తారు?

* * *

సీతి పుడమిమీద పుట్టింది మొదలు ప్రకృతిలోనే ఆడుకుంది. ప్రకృతిలోనే పాడుకుంది. 'తిక్కది' అన్నారు అందరూ. 'పిచ్చిదే!' అన్నాయి కన్నకడుపులు కూడా.

వీధిలోని దుమ్ము నెత్తినిండా నింపుకున్నపుడు ఆకాశం వర్షించి అభ్యంజనం చేయించింది. ఒళ్లుమరిచే

నిదుర కళ్లు నావరించినపుడు అంకాలమ్మ దిన్నెమీది అడ్డరాళ్లన్నీ హంసతూలికల నమర్చాయి. పేడపురుగులు ప్రియబాంధవులుగా తనతో ఆడుకునేవి. తాళ్ళ పూవులు ఆభరణాలుగా తనను అలంకరించేవి.

ఆస్కాకు అందరూ తనను పిచ్చిది అనేవాళ్ళు. బుర్ర గొరుగు నేలా మొట్టికాయ వేసి పళ్లికిలించే వాళ్లు. పకపకనోసి పరిహసించేవాళ్లు. అది వాళ్ళపిచ్చి ఇది తనపిచ్చి.

'ఏయ్ సీతీ! ఆ తొట్టినిండా నీళ్ళుతోడూ' అనేది సరోజమ్మ.

'వసే సీతీ! ఆ కొట్టంలో కాస్త చెత్త వూడ్చి పెట్టు' అనేది సుబ్బాయమ్మ.

సీతి ఎవరు చెప్పినా ఏది చెప్పినా అన్నీ చేస్తుంది ఊరందరికీ చాకిరీచేస్తుంది. అందరికీ చుట్టమే. కడుపు నిండా కమికడన్నం పడేస్తారు. ఒంటినిండా అంతబట్ట పడేస్తారు. అంతా మనవాళ్లే. స్వంత గృహముతో తనకు నిమిత్తంలేదు. అక్కడ తనను తలచేవాళ్లు లేరు. తను పిచ్చిది. చిన్నితమ్ముడిమీద అంతగా ఆశవేస్తే ఎప్పుడేనా వెళ్లి ముద్దాడబోయేది.

'ఛీ! పిచ్చిముండా! వాణ్ణి ముట్టుకోవద్దు' అనేది చెల్లెలు.

'దాన్ని కాస్త అబ్బాయిదగ్గరనుంచీ దూరముగా వెళ్లమనవే' అనేది అమ్మ.

తనకూడా వీరాసామికూతురే. ఆ కుగ్రామంలో ఎకరాపొలమూ, ఒక పూరిగుడిసె, జతఎడ్లకు ఖామందు డైన వీరాసామి కూతురే తనుకూడా. అయినా తమ్ముణ్ణి తనను తాకనివ్వరు. ఛీకొడుతారు. 'హుం! పిచ్చి వాళ్లు!' అని వెళ్లిపోతుంది సీతి.

ఊరిలోని పిల్లలంతా ఆమెకు తమ్ముళ్లే. తనతో ఆడుకుంటారు. ఏడిపిస్తారు. వెంట్రుకలు లాగుతారు. దుమ్ముచల్లి ఆనందిస్తారు. అప్పుడే ఆప్తులైపోయి చిరు తిండ్లు తెచ్చి పెట్టి నవ్విస్తారు. సీతి పకపకనవ్వుతుంది. వాళ్ళూ నవ్వుతారు. అంతా పిచ్చి.

వాళ్లు నిదురపోయే వేళల్లో సీతి ప్రకృతిలోకి జారు కుంటుంది. చీమలు, మిడుతలు, నానావిధాలైన పురుగుజాతులూ తనకు మిత్రులే. వాటితో ఆడుకుం టుంది, వాటితోనే పాడుకుటుంది. ఏ బండమీదనో, కొండమీదనో కాసేపు కన్నుమూసి వూరు చేరుకుం టుంది. పిచ్చిసీతి! 'పిచ్చి ప్రపంచం' అంతా అఖండ విశ్వంలోనే.

మొరడుబారిన మోటుకొమ్మకూడా వసంతం వస్తే పసిమి తిరిగి మిసిమి చూపిస్తుంది. ఒక్కటి— కనీసం ఒక్కమెత్తటి చిగురునైనా చివురింపజేస్తుంది. ప్రకృతి సిద్ధాంతాన్ని పరాభవించడం దానిచేతకాదు.

నల్లని కళ్ళు, మచ్చలైన మొహం, సంస్కా రంలేక వంపులుకట్టిన గుబురువెంట్రుకలు, వయసులోని శరీరం పిచ్చి పిచ్చిగా వంపులుదిద్దుకుంది పిచ్చి సీతికి.

పెళ్ళిపందిట్లో మేళతాళాలు మేళవించుకుని మంత్రపఠనాలు మారుమోగుతున్నాయి. పచ్చతోర ణాలు పరిఢవిల్లుతున్నాయి చిట్టి చెల్లెలు పసిడి బొమ్మలా కూర్చుంది వరునిప్రక్కన మొహంవంచు కుని. పిచ్చిగా చూసింది సీతిపిల్ల. చల్లగా ఒక నవ్వు నవ్వుకుని అంకాలమ్మ దిన్నెకు పరుగుతీసింది

'చెల్లె - మరిది' ఊహూ 'మరిది - చెల్లె' రెండు గొగ్గిరాళ్ళను నిలబెట్టి, పందిరి పెట్టి, తాటాకు మేళం పట్టింది. పెళ్ళిబాగుంటుంది. పెళ్ళి, రెండు మిడతలను పట్టుకుని పందిట్లో కూర్చోబెట్టి మేళం వూద బోయింది. అవి రివ్వున లేచిపోయాయి 'పెళ్ళి- మిడ తన్నకు పెళ్ళి!' అంటూ రాగాలకు లంకించుకుంది.

'ఎందుకు పిల్లా అలా ఏడుస్తున్నావు?' అంటూ విస్తుపోయాడు పాత్రలమూట భుజాన వేసుకుని వెడు తూన్న బుర్రమీసాలాతడు. గిరిజాల క్రాపు. మాసిన మల్లుజుబ్బా. ఎగచెక్కిన పాత పైజమా. నవ్వొచ్చింది సీతికి.

'మిడతన్నకు పెళ్ళిచేదామంటే ఎగిరి పోతు న్నాడు' మాడూ కళ్ళుతుడుచుకుంది.

'పిచ్చిపిల్ల!' అనుకున్నాడు సుంకన్న. 'ఏయ్ పిల్లా! గార్లదిన్నె ఎంతదూరముంది యిక్కడ్నుంచీ?'

'గార్లదిన్నె! మావూరేకదూ? ఇక్కడేవుంది. వెడదామురా' అంటూ గంతులేసి నడిచింది సీతిపిల్ల.

సుంకన్న ఊరిఅవతల పూరిపాకలో మకాం వేశాడు. పాత పాత్రసామగ్రికి కొత్తవస్తువులు మార్చ డం అతడివృత్తి. ఒకవూళ్లో మకాంవేసి చుట్టుపట్ల పల్లెలన్నీ తిరిగాక మజిలీమార్చడం అలవాటు.

ఊరిలోని పిల్లలందరూ సుంకన్నకు రెండు రోజుల్లో మచ్చిక అయిపోయారు. అందరూ నెమ్మ

దిగా చుట్టూ చేరి కూర్చుంటే కాసేపు మాధుర్యంగా మురళి వాయిస్తాడు. తాటాకులతో రకరకాల పీకలు చేసి పిల్లలకందరకీ యిస్తాడు. చాలా సరదామనిషి.

సీత అక్కడే కూర్చుని సుంకన్న చేసే వింత పనులన్నీ చూస్తూవుండేది. అతడు వాకిటి చెత్తవూడ్చ మంటే - వూడ్చిపెట్టి - అతడి మీదపడి నాకూ ఒక పీక చేసి పెట్టమనేది. ఒక్కోక్కరోజు పిల్లలందరూ ఆడుకుని వెళ్లిపోయాక కూడా సుంకన్న వున్న గుడిసె చూరుక్రిందనే మైమరచి నిద్రపోయేది. తనను లక్ష్యం చేసేవాళ్లులేరు. ఎక్కడి కెళ్లావు అనేవాళ్లు లేరు. తనే ప్రకృతి. ప్రకృతియే తాను.

వసంతం వస్తే మోడుకొమ్మ - ఎంత మోడు దైనా చిగురించి తీరుతుంది. కనీసం ఒక - ఒక్క మొగ్గ చివురైనా అంకురిస్తుంది. ఆ చిగురాకుకు అంతగా లేకున్నా - కొంతైనా అందమువుంటుంది.

నల్లని కళ్లు - చుట్టలు తిరిగిన సంస్కారం లేని జుత్తు, పిచ్చి పిచ్చిగా మిట్ట పల్లాలతో వంకరలు తిరిగిన వయసు శరీరం, అర్ధరాత్రి పండువెన్నెల్లో వెర్రిగా వెల్లకిలబడి నిదురపోతున్న సీతి పిల్లలో పిచ్చి సౌందర్యాన్ని వెలకొల్పాయి ప్రక్క పల్లెనుంచి అప్పుడే యింటికి వచ్చిన సుంకన్న చూరు క్రింది సీతి పిల్లను చూశాడు.

దిక్కు లేని కుక్క. ఎక్కడ పడితే అక్కడ నిదురోతుంది తలచేవాళ్లు లేరు. మనిషే, మాంసం, రక్తం అన్నీవున్నాయి.

ఏకాంతం. ప్రకృతి స్తబ్ధత. ఆనల్లని కళ్లు, గుండ్రని మొహం, ఎత్తుపల్లాలు, మాంసపు హంగు! మతి పోయింది సుంకన్నకు. చుట్టూ చూశాడు. ప్రకృతి పలకరించింది. చెట్లు చెవులొగ్గి వింటున్నాయి. ఇంకెవ్వరూ లేరు.

అతడిలోని నీచమృగం గర్జించింది. సీతిని స్పృశించాడు. వులిక్కిపడి లేచి "సువ్వా! నాకు పీక చేసివ్వకుండా యిందాక ఎక్కడి కెళ్లావు? ఇప్పుడు చేసివ్వు" రాగాలు తీసింది సీతి.

"లోనికి పోదాం రా - పీకలు గాదెమీద వున్నాయిగా"

పిచ్చి గంతులేస్తూ మగతలో ఒళ్లు విరిచింది సీతి. వంపులు, సొంపులు, ఎత్తులు-పల్లాలు- పిచ్చిలో సౌందర్యం.

సుంకన్నలోని పిచ్చి పసువు అంకె వేసింది. వేడి నెత్తుటులు రెండూ స్పృశించుకున్నాయి

"ఏంటి" అంది సీతి. కానీ వసంతం — మోడు కొమ్మలో కూడా ఏవోపులక లెత్తాయి. మొగ్గలు వేసి పుష్పించింది.

* * *

"పాపిష్టి ముండ! ఎంతపని చేసుకుంది!"

"గాడిదకొడుకు, నోరులేని పిచ్చి ముండతో పాపి కూడుకుడిచి, దాని జీవితంలో కొరివి పెట్టాడు."

ఏమిటి వీళ్ళను కోపడము? ఎందుకిలా మొహం చిట్లించు కోవడం? అయోమయంగా కనిపించింది సీతి పిల్లకు. సుంకన్న పీక చేసివ్వకుండా వెళ్ళిపోయాడని వీధులంబట పడి ఏడ్చింది. కనబడ్డ ప్రతి అమ్మలక్కలూ తన కడుపువైపే చూస్తూ దెప్పి పొడిచారు.

ఏముంది కడుపులో? ఏదో కదలికలు. క్రొత్త క్రొత్త కదలికలు. నూతనమైన—ఇన పిచ్చి మనసుకు గోచరించని అనుభవాలు!

ముందు ప్రతి గుమ్మమూ తనను ఆహ్వానించేది. ప్రతి అమ్మా కమికెడన్నం పడేసి కమ్మగా మాట్లాడించేది. కానీ—కానీ యిప్పుడు కళ్లు తెరవని కసుగందు కూడా తనను గుమ్మం త్రొక్కవద్దని గదమాయిస్తుంది. కనపడ్డ ప్రతి అమ్మా కళ్ళెర్రజేసి చూస్తుంది. కన్నతల్లి కూడా కళ్ళనీళ్లు బెట్టి "పాపిముండా! ఎక్కడేనా వెళ్ళి చావో—నూయో చూసుకోరాదూ!" అంటూ వ్రేళ్లు విరుస్తుంది.

ఏమి టిదంతా? ఎందుకు ప్రపంచమిలా మారిపోయింది? చేలోకి వెళ్ళిపోయింది సీతి. మిడతలు రెండు పట్టుకుని కాసేపు ఆడుకుంది. గుంటనీడలో ఘడియసేపు కునుకుతీసింది. ఆకలేస్తోంది. ప్రొద్దు అంకాలమ్మ దిన్న క్రింద అస్తమిస్తోంది. కడుపులో అలసట. క్రొత్త క్రొత్త కదలికలు. ఆరాటము. ఊళ్లోకి వెళ్ళి సుబ్బాయమ్మను కాస్త గంజి పోయమని ప్రాధేయపడింది.

"ఛీ! ముండా. గుమ్మం త్రొక్కవద్దని ఎన్ని సారులు చెప్పాలి నీకు? శని కూర్చుంటుంది ముండ

మొహం చూస్తే. వెళ్లు అవతలికి." కట్టె చేతిలోకి తీసుకుంది సుబ్బాయమ్మ.

వెంటనే అంకాలమ్మ దిన్నె మీద గుండా ప్రక్కనున్న పట్నానికి దారితీసింది సీతిపిల్ల.

సంఘం, నియమాలు, నిబద్ధాలు. కట్టుబాట్లు, ఏమి తెలుసు సీతిపిల్లకి యిన్ని యిబ్బందులు ఏమస్తాయని? సంఘమంటే రోజా ముళ్లపొద అని ఆమెకు ఎవరు నేర్పారు? ప్రకృతిలో పుట్టింది. ప్రకృతితో పాడింది. సుంకన్న ఏదో తనకు తోచని—తనకు అందని అనుభూతి నొకదాన్ని అందించాడు. అందుకుంది. అంతే.

కడుపులోని క్రూరకుంకడు ఆకలితో అల్లరి చేసే నవమమాసం నడుముకు చుట్టుకుంది. బాధ. ఆవేదన. పట్నంలోని కుక్కలు — అవీ కుంటికుక్కలు—కురూపి కుక్కలు—ఎంగిలి ఆకుల్లోని కూటిమెతుకులు కూడా తనచేతికి అందనివ్వవు. అంకాలమ్మ దిన్నె మీద దిమ్మదిరిగేలా గంతులేసేది సీతి. కాని ఈనాడు కూర్చున్న చోటునుంచీ కదలడమే కష్టమయిపోయింది.

ఏమి టీమార్పు? ఎందుకొచ్చింది? చిరాకేసింది సీతికి. కష్టం మీద కదిలింది గార్ల దిన్నెకు అభిముఖంగా.

"మళ్ళీ తగలడింది పీడముండ! ఎక్కడో విరగడయిపోయిందనుకున్నాము." ఇంట్లో పిల్లా జల్లా అంతా దెప్పి పొడిచారు.

ఊళ్ళో అందరూ వుమ్మివేశారు.

కాని కమికెడన్నం పెట్టిన పాపాన పోలేదు ఎవరూ. కడకు గుటికెడు నీళ్లు పోయలేదు. ప్రపంచం. నియమాలు...నిబంధాలు...

అడుగుపైన అడుగు వేసుకుంటూ అంకాలమ్మ దిన్నెకు వెళ్ళింది సీతిపిల్ల. తాటాకులు పీకలు చుట్టింది. వాయించలేక పోయింది. రాళ్ళు నిలబెట్టి కానుగ ఆకులతో గుడి కట్టాలనుకుంది. కాని కదలలేక పోయింది. సూర్యుడు కూడా ఎర్ర ఎర్రగా కళ్లెర్ర చేసి దిన్నె క్రిందకు చేరుకున్నాడు. మంచు, పొగమంచు కురుస్తోంది. చలి శరీరాన్ని చిదికేస్తోంది. వెండి చంద్రుడు మట్టుకు వెలుగుతూనే వున్నాడు.

మెల్లగా ఏటి వంకకు కదిలి కడుపునిండా నీళు త్రాగి నల్లరాతి గుంటకి చేరగిలపడింది సీతిపిల్ల. ప్రపంచమంతా ప్రశాంతంగా నిద్రపోతోంది. కానీ తనకు కునుకు రాదు. కడుపులో ఏదో కల కల, బాధ, సుస్తీ, చలి, చెమ్మ. క్రిందకు వాలిపోయింది సీతి. కళ్ళు మూతలు పడుతున్నాయి. కాళ్లు గుంజుకుంటోంది.

ప్రకృతిమాత పమిటె విసిరింది.

సెలయేటి చిరుతరగలు వింజామరలు పట్టాయి.

పుడమితల్లికి పురిటినొప్పులు వచ్చి మూగగా మూల్గింది.

ఊరి చివరను కుంటికుక్కకు కునుకు రాక 'కయో' మని కాళ్లు కడుపులో దాచుకుంది కట్టా కలితో కంపించిపోతూ.

చిన్ని దీపానొకదాన్ని చిత్రంగా వెలిగించేసి కొడి కట్టిన గుడ్డి దీపం గుప్పుమని ఆరిపోయింది.

'కేవు' మన్న కేక మాత్రం ప్రపంచాన్ని పారవశ్యం పొందించింది.

ఆకాశంలోనుంచి అలరు వర్షం కురియలేదు.

గంధర్వవరులు గానం చేయలేదు.

మొరడు బారిన మోటుకొమ్మ మాత్రం మొగ్గ తొడిగి ఎండిపోయింది.